ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 255 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
బుధవారం 16 ఏప్రిల్ 2025
RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

ఆ పత్రికను సోనియా, రాహుల్ ఏటీఎంలా వాడుకున్నారు: భాజపా

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ అభియోగపత్రం మోపిన విషయం తెలిసిందే. దీనిపై భాజపా స్పందిస్తూ.. చారిత్రక నేపథ్యం గల నేషనల్ హెరాల్డ్ పత్రికను గాంధీ కుటుంబం ప్రైవేటు ఏటీఎంలా వాడుకుందని విమర్శించారు.

దిల్లీ, ఏప్రిల్ 16, (రిపబ్లిక్ న్యూస్): నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్గాంధీలపై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అభియోగపత్రం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దేశ వ్యాప్తంగా ఈడీ కార్యాలయాల ఎదుట నిరసనలు చేపడుతున్నారు. దీనిపై భాజపా స్పందిస్తూ.. చారిత్రక నేపథ్యం గల నేషనల్ హెరాల్డ్ వార్తాపత్రికను కాంగ్రెస్ అగ్రనేతలు తమ ప్రైవేటు ఏటీఎంగా వాడుకున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంది కానీ.. ప్రభుత్వ ఆస్తులను దుర్వినియోగం చేసి నేషనల్ హెరాల్డ్ను ఇచ్చే హక్కు లేదని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

దేశ రాజధానిలోని బహదూర్ షా జాఫర్ మార్గ్ నుంచి ముంబయి, లఖ్నవూ, భోపాల్, పట్నా వరకు దేశవ్యాప్తంగా ఉన్న విలువైన ప్రజాఆస్తులను యంగ్ ఇండియా లిమిటెడ్ ద్వారా గాంధీ కుటుంబం చేతుల్లోకి బదిలీ చేయడానికి ఈ కార్పొరేట్ కుట్ర పన్నారని ఆరోపించారు. 'అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్' (ఏజేఎల్)కు సంబంధించిన 99% షేర్లను కేవలం రూ.50 లక్షలకు బదలాయించుకొని, రూ. రెండు వేల కోట్ల విలువ చేసే ఆస్తుల్ని గాంధీ కుటుంబం తప్పుడు మార్గాన కైవసం చేసుకుందని ఆరోపించారు. స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల గొంతును బలోపేతం చేయడానికి ఏర్పాటుచేసిన ఈ వార్తా పత్రికను గాంధీ కుటుంబం తమ ప్రైవేట్ ఏటీఎంగా వాడుకున్నారని దుయ్యబట్టారు. ఈ కేసును కొట్టివేయించడానికి సోనియాగాంధీ, రాహుల్ ఎన్ని ప్రయత్నాలు చేసినా అవన్నీ విఫలమయ్యానని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అక్రమాలకు పాల్పడినవారు తప్పించుకోవడానికి ఇది కాంగ్రెస్ పాలన కాదని.. ప్రధాని నరేంద్ర మోదీ నడిపిస్తున్న దేశమని అన్నారు. ఇక్కడ రాజ్యాంగానికి ఎవరూ అతీతులు కాదని పేర్కొన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీల పై ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగపత్రం నమోదు చేసింది. సోనియాను మొదటి నిందితురాలి (ఏ-1)గా, రాహుల్ను ఏ-2గా దీనిలో పేర్కొంది. న్యాయరీత్యా విచారణ చేసే హక్కు కోణంలో న్యాయమూర్తి దీనిని పరిశీలించి, తదుపరి విచారణను ఈనెల 25కి వాయిదా వేశారు. కేసు డైరీలను తమ పరిశీలన కోసం సమర్పించాలని ఈడీ తరపు న్యాయవాదిని ఆదేశించారు. కాంగ్రెస్ నేతలు శ్యాం పిట్రోడా, సుమన్ దుబె తదితరులను కూడా ఈ కేసులో నిందితులుగా ఈడీ పేర్కొంది.

స్కూల్‌లో విష ప్రయోగం.. విద్యార్థులకు తప్పిన పెనుముప్పు

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురిలోని పాఠశాలలో విష ప్రయోగం జరిగింది. సిబ్బంది అప్రమత్తతతో 30 మంది విద్యార్థులకు పెను ముప్పు తప్పింది.

ఇచ్చోడ, ఏప్రిల్ 16, (రిపబ్లిక్ న్యూస్): స్కూల్‌లో విష ప్రయోగం జరిగింది. విద్యార్థులు తాగే నీటి ట్యాంకులో దుండగులు పురుగుల మందు కలిపారు. మధ్యాహ్న భోజన సామగ్రిపై కూడా చల్లారు. సిబ్బంది అప్రమత్తతతో స్కూల్లోని 30 మంది విద్యార్థులకు పెను ముప్పు తప్పింది.

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ధర్మపురిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం, ఆదివారం సెలవులు రావడంతో సిబ్బంది పాఠశాలలో వంట గదికి తాళం వేసి వెళ్లారు. సోమవారం ఉదయం వంట చేసేందుకు పాత్రలు కడిగే సమయంలో చెడు వాసన, నురగలు వచ్చాయి. అప్రమత్తమైన సిబ్బంది చుట్టూ చూడగా పురుగుల మందు డబ్బా కనిపించింది. తాగు నీటి ట్యాంకులోనూ దాన్ని కలిపినట్లు వారు గుర్తించారు. విద్యార్థులను తాగునీటి కుళాయిల వైపు వెళ్లకుండా చూశారు. మధ్యాహ్న భోజనం వండలేదు. ఈ ఘటనపై పాఠశాల హెచ్ఎం ప్రతిభ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అశ్లీల వెబ్సైట్లకు వీడియోల విక్రయం.. ముగ్గురి అరెస్ట్

అశ్లీల వెబ్సైట్లకు వీడియోలు సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ తెలిపారు.

గుంటూరు, ఏప్రిల్ 16, (రిపబ్లిక్ న్యూస్): అశ్లీల వెబ్సైట్లకు వీడియోలు సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు 'ఈగల్' చీఫ్ ఆకే రవికృష్ణ తెలిపారు. ముగ్గురు నిందితులను గుంటూరులో పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు.

"అశ్లీల వెబ్సైట్లకు నిందితులు వీడియోలను అందిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. గుంతకల్లుకు చెందిన లూయిస్ కాల్ సెంటర్ నడుపుతూ అక్కడ పనిచేస్తున్న వారితో బలవంతంగా అశ్లీల వీడియోలు చిత్రీకరిస్తున్నాడు. వాటిని నిషేధిత వెబ్సైట్లకు విక్రయిస్తున్నాడు. సైప్రస్ దేశానికి చెందిన సైట్ నిర్వాహకులు ఆన్లైన్ చెల్లింపులు చేస్తున్నారు. లూయిస్ తో పాటు శ్రీకాకుళానికి చెందిన గణేశ్, జ్యోత్స్నలను అరెస్ట్ చేశాం"అని రవికృష్ణ తెలిపారు.

కేంద్రం అదనపు సాయం చేసేలా ప్రతిపాదనలు పంపండి..
ఆర్థిక సంఘం ప్రతినిధులతో సీఎం చంద్రబాబు

రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుపై సచివాలయం మొదటి బ్లాక్ లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది.

అమరావతి, ఏప్రిల్ 16, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుపై సచివాలయం మొదటి బ్లాక్లో ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఫొటో ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేసింది. ఫొటో ఎగ్జిబిషన్లోని అంశాలపై సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలను ఎగ్జిబిషన్లో ప్రదర్శనకు ఉంచారు.

ఈ సందర్భంగా రాజధాని విషయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను సీఎం వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, అందాల్సిన ప్రత్యేక సాయంపై సీఎం ప్రజంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047 గురించి తెలిపారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు అనుకూలతల గురించి చెప్పారు. విభజన అనంతరం రాష్ట్రం ఎదుర్కొన్న ఆర్థిక కష్టాలను మరోసారి వివరించారు. గత ఐదేళ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసంతో ఎదుర్కొంటున్న సవాళ్లను వారి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం అదనపు సాయం చేయాలని.. దానికి అనుగుణంగా ప్రతిపాదనలు ఇవ్వాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

అమరావతిపై కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు :మంత్రి నారాయణ ఆగ్రహం

రాజధాని అమరావతి పై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమరావతి, ఏప్రిల్ 16, (రిపబ్లిక్ న్యూస్): రాజధాని అమరావతి పై కొంతమంది లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారని పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతుల భూముల ధర నిలవాలన్నా.. పెరగాలన్నా స్మార్ట్ ఇండస్ట్రీస్ రావాలని చెప్పారు. బుధవారం మీడియాతో మంత్రి మాట్లాడారు.

"విదేశాల నుంచి వచ్చి పరిశ్రమలు పెట్టాలంటే ఫ్లైట్ కనెక్టివిటీ ఉండాలి. అందుకే అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయం కట్టాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఎయిర్పోర్ట్ కోసం భూసేకరణ లేదా భూ సమీకరణ అనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇప్పటికే అమరావతిలో పనులు ప్రారంభం అయ్యాయి. భూములిచ్చిన రైతు సోదరులకు ఎలాంటి అపోహలు వద్దు. ఇచ్చిన మాట ప్రకారం అన్నీ చేస్తాం. మూడేళ్లలో రాజధాని నిర్మాణం పూర్తవుతుంది" అని పి. నారాయణ తెలిపారు.

ఈడీ విచారణకు రాబర్ట్ వ్రాడా.. వెంట వెళ్లిన ప్రియాంక

కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకగాంధీ భర్త రాబర్ట్ వాద్రా రెండో రోజు ఈడీ విచారణకు హాజరయ్యారు.

(రిపబ్లిక్ న్యూస్), ఏప్రిల్ 16: హరియాణా భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసు విచారణ నిమిత్తం కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ భర్త రాబర్ట్ వాద్రా బుధవారం మరోసారి ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన వెంట ప్రియాంక కూడా ఉన్నారు.

ఈ కేసుకు సంబంధించి వాద్రా కు ఈడీ మంగళవారం నోటీసులు జారీ చేసి తమముందు హాజరుకావాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. నోటీసులు అందిన అనంతరం ఆయన నడుచుకుంటూ కార్యాలయానికి వెళ్లారు. దాదాపు ఐదు గంటల పాటు ఆయన వాంగ్మూలాన్ని రికార్డు చేయగా.. బుధవారం కూడా హాజరుకావాలని ఆదేశించారు. ఈక్రమంలోనే ఆయన తాజాగా ఈడీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వెంట ప్రియాంక కూడా ఉన్నారు. ఈసందర్భంగా వాద్రా లోపలికి వెళ్తుండగా ప్రియాంక ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం వాద్రాను అధికారులు విచారిస్తున్నారు. ప్రియాంక కార్యాలయంలోని వెయిటింగ్ రూమ్లో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా.. విచారణకు హాజరయ్యే సమయంలో వాద్రా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఇది చాలా దురదృష్టకరం. ప్రభుత్వ తప్పిదాలను బయటకు చెప్పేవారిపై ఈడీతో సహా ఇతర ఏజెన్సీలు దాడులు చేస్తున్నాయి. దీన్ని దేశంలోని ప్రతిఒక్కరూ గమనిస్తున్నారు. ఈ ఏజెన్సీలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఇలా చేస్తున్నారు. నాపై చేస్తున్న తప్పుడు ఆరోపణలకు వ్యతిరేకంగా నేను పోరాటం చేస్తున్నా. అందుకే ఇది జరిగింది. ప్రజలు నాతో ఉన్నారు. వారు నన్ను రాజకీయాల్లో చూడాలనుకుంటున్నారు' అని వాద్రా పేర్కొన్నారు. ఈడీ ప్రకారం.. వాద్రా కంపెనీ 2008 ఫిబ్రవరిలో గుర్గావ్లోని షికోపూర్లో 3.5 ఎకరాల స్థలాన్ని ఓంకారేశ్వర్ ప్రాపర్టీ నుంచి కొనుగోలు చేసింది. దీని విలువ రూ.7.5 కోట్లు. ఆ తర్వాత వాద్రా కంపెనీ ఆ భూమిని రియల్ ఎస్టేట్ కంపెనీ అయిన డీఎల్ఎఫ్కు రూ.58 కోట్లకు విక్రయించింది. డీఎల్ఎఫ్కు రూ.58 కోట్ల భారీ లాభంతో విక్రయించడంతో మనీలాండరింగ్ ఆరోపణలు వచ్చాయి. ఈనేపథ్యంలో ఈడీ విచారణ జరుపుతోంది.

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం..
సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

హైదరాబాద్ లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది.

దిల్లీ, ఏప్రిల్ 16, (రిపబ్లిక్ న్యూస్): హైదరాబాద్లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది.

చెట్లు కొట్టేసే ముందు 1996లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అనుమతులు తీసుకున్నారా? లేదా? స్పష్టంగా చెప్పాలని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. అనుమతులతోనే ఆ భూముల్లో జామాయిల్ తరహా చెట్లు, పొదలను తొలగించినట్లు ప్రభుత్వం తరపు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ తెలిపారు. తెలంగాణలో వాల్టా చట్టం అమలులో ఉందని.. దాని ప్రకారం ప్రభుత్వం వ్యవహరించిందని అమికస్ క్యూరీ చెప్పారు. అనుమతులు తీసుకోకుండా చెట్లు కొట్టివేసినట్లు తేలితే సీఎస్ సహా సంబంధిత అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని తీవ్ర స్థాయిలో వ్యాఖ్యానించారు. 1996 డిసెంబర్లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు ఏమాత్రం విరుద్ధంగా వ్యవహరించినా చూస్తూ ఊరుకోబోమన్నారు. రూ.10వేల కోట్లకు మార్టిగేజ్ చేశారని సీఈసీ నివేదికలో చెప్పిందని అమికస్ క్యూరీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను మార్టిగేజ్ చేశారా.. అమ్ముకున్నారా? అనేది తమకు అనవసరమని జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. చెట్లు కొట్టివేసే ముందు అనుమతి ఉందా? లేదా? అనేది మాత్రమే ముఖ్యమని చెప్పారు. 2004 నుంచి ఈ భూముల వ్యవహారం, కోర్టుల్లో ఉన్న పరిస్థితి.. ఆ తర్వాత చుట్టుపక్కల జరిగిన అభివృద్ధి తదితర వివరాలను అభిషేక్ మను సింఘ్వీ వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంపై స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మే 15వ తేదీకి వాయిదా వేసింది.

అమిత్ షాను ప్రధాని మోదీ నియంత్రించాలి:మమత

వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా బెంగాల్లో చెలరేగిన హింసలో హోంమంత్రి అమిత్ షా హస్తం ఉందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు.

(రిపబ్లిక్ న్యూస్), ఏప్రిల్ 16: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కేంద్ర హోంమంత్రి అమిత్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. వక్ఫ్ (సవరణ) చట్టం-2025కి వ్యతిరేకంగా పశ్చిమబెంగాల్లో ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారడంలో ఆయన హస్తం ఉందని ఆరోపించారు.

ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన హింస అని.. ఇందుకోసం కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీఎస్ఎఫ్ కలిసి కుట్రపూరితంగా బంగ్లాదేశీయులను బెంగాల్లోకి వదిలారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతల పైకి ఆయన దర్యాప్తును సంస్థలను అస్త్రంగా ఉపయోగించి భయపెట్టాలని ప్రయత్నిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ అమిత్షాను నియంత్రించాలని అన్నారు. ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణలకు సంబంధించిన దృశ్యాలను బెంగాల్లో జరుగుతున్నట్లు చిత్రీకరిస్తూ.. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో తమ పార్టీ ముందంజలో ఉందన్నారు. ఈవిషయంపై ప్రజలు శాంతియుత నిరసనలు చేపట్టాలని కోరారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

చరిత్రలో నేటి ప్రత్యేకత

- **2007 :** తెలుగు నాటకరంగ దినోత్సవం
- **1919 :** అమృతసర్ ఉదంతంలో మరణించిన ఉద్యమకారులకు నివాళు లర్పిస్తూ మహాత్మా గాంధీ ఒక రోజు ప్రార్థన, ఉపవాసం నిర్వహించాడు.
- **1848 :** భారతీయ సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జననం (మ.1919). (చిత్రంలో)
- **1853 :** భారత్ లో రైళ్ళ నడక మొదలయింది. మొదటి ప్రయాణీకుల
- రైలు బోరి బందర్, బొంబాయి నుండి థానే వరకు ప్రారంభించబడినది.
- **1889 :** హాస్యనటుడు చార్లీ చాప్లిన్ జననం (మ.1977).

1950 : తెలుగు సినిమా హాస్యనటుడు, దర్శకుడు ఎం.ఎస్.నారాయణ జననం (మ.2015).

1946 : తెలుగు సినిమా నటుడు బళ్ళారి రాఘవ మరణం (జ.1880).

తెలుగు నాటకరంగ దినోత్సవం

అమృతసర్

కందుకూరి వీరేశలింగం పంతులు

భారత్

చార్లీ చాప్లిన్

ఎం.ఎస్.నారాయణ

బళ్ళారి రాఘవ

న్యూలుక్లో ఖుష్బూ.. ట్రోలర్స్కు స్ట్రాంగ్ కౌంటర్

నటి ఖుష్బూ తన తాజా లుక్‌తో ఆశ్చర్యపరిచారు. ఆ ఫొటోలను కొందరు ట్రోల్ చేయగా.. ఆమె స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.



సోషల్ మీడియాలో తరచూ తన ఫొటోలు పంచుకుంటుంటారు నటి ఖుష్బూ. తాజాగా ఆమె తన న్యూలుక్ ఫొటోలను షేర్ చేశారు. అందులో ఆమె చాలా సన్నగా కనిపించడంతో కొందరు నెటిజన్లు ట్రోలింగ్ చేయడం మొదలుపెట్టారు. దీంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. తన తాజా ఫొటోలను షేర్ చేసిన ఖుష్బూ.. "బ్యాక్ టూ ద ఫ్యూచర్'అనే క్యాప్షన్ పెట్టారు. కొందరు ఆమె సన్నబడిన తీరును ప్రశంసిస్తుంటే మరికొందరు మాత్రం 'సన్నగా మారడానికి ఇంజెక్షన్స్ చేయించుకున్నారు. వాటి మేజిక్ వల్లే ఇలా మారిపోయారు. వాటి గురించి ఫాలోవర్స్కు కూడా చెప్పండి' అని కామెంట్ పెట్టారు. దీనికి ఆమె స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. "మీరు ఎలాంటి మనుషులు? మీరెప్పుడు మీ ముఖాలను సోషల్ మీడియాలో చూపించరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది" అని రీట్వీట్ చేశారు. ఇక ప్రస్తుతం ఖుష్బూ సీరియల్స్, సినిమాల్లో నటిస్తున్నారు. ఇటీవలే 'నేసిప్పాయ' అనే తమిళ సినిమాలో కనిపించారు.

అది ఓ అసహ్యకరమైన సంఘటన : చేదు అనుభవం గుర్తుచేసుకున్న మలయాళ నటి

ఓ నటుడు డ్రగ్స్ తీసుకొని తనను ఇబ్బంది పెట్టారని మలయాళ నటి విన్సీ సోనీ వెల్లడించారు. తన జీవితంలో అది ఓ. అసహ్యకరమైన సంఘటన అని పేర్కొన్నారు.

గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు మలయాళ నటి విన్సీ సోనీ అలోషియస్. ఒక సినిమా సెట్స్లో హీరో తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. అయితే అతడి పేరును మాత్రం విన్సీ వెల్లడించలేదు. "సినిమా షూటింగ్ సమయంలో ఆ హీరో డ్రగ్స్ తీసుకున్నాడు. నాతో అనుచితంగా ప్రవర్తించాడు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు ఎంతో ఇబ్బందిపడ్డా. తన ముందే దుస్తులు మార్చుకోమని ఇబ్బందిపెట్టాడు. అందరి ముందే ఇలాంటి మాటలు మాట్లాడేవాడు. నా జీవితంలో ఇది ఒక అసహ్యకరమైన సంఘటన. దీని తర్వాత ఇక డ్రగ్స్ అలవాటు ఉన్న నటులతో నటించకూడదని నిర్ణయించుకున్నాను. నేను తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహుశా భవిష్యత్తులో నాకు సినిమాల్లో ఎక్కువ అవకాశాలు రాకపోవచ్చు. కానీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. ఈ వ్యసనం ఉన్న వారితో నేను నటించను. నాతో అలా ప్రవర్తించిన నటుడి గురించి అందరికీ తెలుసు కానీ ఎవరూ స్పందించలేదు. డ్రగ్స్ తీసుకోవడం అతడి పూర్తి వ్యక్తిగత విషయం కావచ్చు.. కానీ, వృత్తిపరమైన వాతావరణంపై అది ప్రభావితం చూపకూడదు. ఇది ఆమోదయోగ్యం కాదు" అని విన్సీ అన్నారు. 2019లో విన్సీ సోనీ ఇండస్ట్రీకి వచ్చారు. 'రేఖ' చిత్రంతో కేరళ రాష్ట్ర ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. ఆమె నటించిన 'జనగణమన' చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఎన్ని నిందలు వేసినా ఏమీ అనుకోను :ఏఆర్ రెహమాన్

ఏఆర్ రెహమాన్‌ను ఉద్దేశించి ప్రముఖ గాయకుడు అభిజీత్ ఇటీవల విమర్శలు చేసిన విషయం తెలిసిందే. మ్యూజిక్ విషయంలో రెహమాన్ ఎక్కువగా టెక్నాలజీపైనే ఆధారపడతారని వ్యాఖ్యానించారు. దీనిపై రెహమాన్ తాజాగా స్పందించారు.

ఏఆర్ రెహమాన్‌ను ఉద్దేశించి ప్రముఖ గాయకుడు అభిజీత్ ఇటీవల విమర్శలు చేసిన విషయం తెలిసిందే. దీనిని ఉద్దేశించి రెహమాన్ తాజాగా స్పందించారు. ఎన్ని విషయాల్లో తనని తప్పుపట్టినా తాను ఏమీ అనుకోనని అన్నారు. ప్రతిఒక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుందని.. దానిని తప్పుపట్టాల్సిన అవసరం లేదని వెల్లడించారు. "అన్ని విషయాలకు నన్ను తప్పుపట్టడం బాగానే ఉంది. అభిజీత్ నాపై ఎలాంటి విమర్శలు చేసినా నేను ఆయన్ని గౌరవిస్తూనే ఉంటా. ఆయన అంటే నాకెంతో అభిమానం. ప్రేమతో ఆయనకు స్వీట్స్ పంపుతా. నా వర్పై ఆయనకు ఉన్న అభిప్రాయాన్ని ఆవిధంగా బయటపెట్టారు. దానిని నేను ఏమాత్రం తప్పుపట్టను. ఎందుకంటే ప్రతి విషయంలో ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉంటుంది" అని రెహమాన్ అన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అభిజీత్ సంగీత రంగంలో వస్తోన్న మార్పులపై స్పందించారు. ఇందులోభాగంగా ఆయన ఏఆర్ రెహమాన్ గురించి మాట్లాడారు. రెహమాన్ ఎక్కువగా టెక్నాలజీపై ఆధారపడుతున్నారని విమర్శించారు. యనీగాయకులకు బదులు.. టెక్నాలజీని ఉపయోగించి ఆయన మ్యూజిక్ కంపోజ్ చేస్తున్నారన్నారు. దానివల్ల ఎంతోమందికి ఉపాధి లేకుండా పోతుందని తెలిపారు. ఈ వ్యాఖ్యల పైనా రెహమాన్ మాట్లాడారు. ఇప్పటికే తాను ఒక మహిళా ఆర్కెస్ట్రా బృందాన్ని సిద్ధం చేసినట్లు వెల్లడించారు. "దుబాయ్ వేదికగా ఇటీవల ఒక మహిళా ఆర్కెస్ట్రా బృందాన్ని సిద్ధం చేశా. అందులో సుమారు 60 మంది మహిళలు ఉన్నారు. వారికి ఉద్యోగాలు ఇచ్చి ప్రతి నెలా జీతం ఇస్తున్నా. వాళ్ల కోసం ఆరోగ్య, జీవిత బీమా కడుతున్నా. అంతేకాకుండా 'పొన్నియిన్ సెల్వన్', 'ఛావా' వంటి చిత్రాల కోసం వర్క్ చేసినప్పుడు సుమారు 200 మంది సంగీతకారులను అందులో భాగం చేశా. కొన్నిసార్లు కేవలం పాటల కోసమే 100 మందికి పైగా వర్క్ చేస్తుంటారు. ఆ విషయాలను నేను ఎక్కడా బయటపెట్టను. అలాగే దానికి సంబంధించిన ఫొటోలనూ పంచుకోను. కాబట్టి ఎవరికీ నా వర్కింగ్ స్టైల్ గురించి పెద్దగా అవగాహన ఉండదు" అని ఆయన వివరణ ఇచ్చారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్

తండ్రయిన జహీరాఖాన్.. సోషల్ మీడియాలో పోస్ట్

క్రికెటర్ జహీర్ ఖాన్ సతీమణి సాగరిక ఘట్కే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు.



క్రికెటర్ జహీర్ ఖాన్ తండ్రయ్యారు. ఆయన సతీమణి, నటి సాగరిక పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని బుధవారం ఇన్స్టా వేదికగా వెల్లడిస్తూ చిన్నారి ఫొటోను పంచుకున్నారు. తమ కుమారుడికి ఫతేసిన్హ్ ఖాన్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. సాగరిక మాతృత్వపు ప్రయాణాన్ని జహీరాఖాన్ దంపతులు ఇప్పటివరకు సీక్రెట్గా ఉంచారు. నేడు చిన్నారి ఫొటో షేర్ చేసి సర్ప్రైజ్ ఇచ్చారు. ఈ జంటకు పలువురు ప్రముఖులతో పాటు నెటిజన్లు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. 2016లో మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ వివాహ వేడుకలో తొలిసారిగా జహీర్, సాగరిక కలిసి కన్పించి తమ ప్రేమబంధాన్ని బయటపెట్టారు. 2017 నవంబరులో వివాహ బంధంతో ఒక్కటయ్యారు. షారుక్ ఖాన్ నటించిన 'చక్ దే ఇండియా'తో సాగరిక బాలీవుడ్కు పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించారు. ఇక, జహీర్ ఖాన్ ప్రస్తుతం ఐపీఎల్లో లఖ్నవూ సూపర్ జెయింట్స్ జట్టుకు మెంటార్గా వ్యవహరిస్తున్నారు.

అందం

కళ్ల చుట్టూ డార్క్ సర్కిల్స్‌తో చూడ్డానికే ఇబ్బందిగా మారాయా, కొన్ని పదార్థాలతో కాసేపు మసాజ్ చేస్తే సమస్య మాయం

కంటిచుట్టూ నల్లని వలయాలు రావడానికి చాలానే కారణాలు ఉంటాయి. అయితే, ఇవి రావడం వల్ల చూడ్డానికి అంతగా బాగోవు. వీటిని తగ్గించేందుకు ఎలాంటి టిప్స్ హెల్ప్ చేస్తాయో తెలుసుకోండి.

నీరసం, స్ట్రెస్, పెరిగిన వయసు, జెనెటిక్స్ ఇలా చాలా కారణాల వల్ల కంటి చుట్టూ నల్లని వలయాలు వస్తాయి. ఇవి అంత ప్రమాదకరం కానప్పటికీ చూడ్డానికి మాత్రం కాస్తా ఇబ్బందిగానే కనిపిస్తాయి. ఈ సమస్యని తగ్గించేందుకు చాలా రకాల ట్రీట్‌మెంట్స్ ఉన్నాయి. అందులో కొన్ని ఇంటి చిట్కాలు కూడా. ఈ ఇంటి చిట్కాల కారణంగా డార్క్ సర్కిల్స్ కాస్తా లైటెన్ అవుతాయి. మరి ఆ టిప్స్ ఏంటో తెలుసుకోండి.

రోజ్ వాటర్

రోజ్ వాటర్ కూడా నల్లని వలయాలని దూరం చేసేందుకు హెల్ప్ చేస్తుంది. ఇందులో విటమిన్ ఎ, సిలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కళ్ల కింద నల్లదనాన్ని తగ్గించేందుకు హెల్ప్ చేస్తుంది. దీనికోసం రోజ్‌వాటర్‌లో దూదిని ముంచి కళ్లపై ఉంచి కాసేపు అలానే ఉంచండి. తర్వాత కాటన్ తీసేయండి. కానీ, కళ్లు కడగకూడదు. రోజూ లా చేస్తే మంచి మంచి రిజల్ట్ ఉంటుంది.

దోస, నిమ్మరసం

నిమ్మరసంలో మంచి బ్లీచింగ్ గుణాలు ఉంటాయి. దీనిని అప్లై చేయడం వల్ల కూడా సమస్య తగ్గుతుంది. అయితే, దీనిని నేరుగా రాయొద్దు. అందులో కొద్దిగా దోస రసం, చిటికెడు పసుపు కలిపి రాయండి. నిమ్మరసం మరీ ఎక్కువగా వాడకూడదని గుర్తుంచుకోండి.

విటమిన్ ఇ ఆయిల్



విటమిన్ ఇ అనేది మంచి పోషకం. దీనిని మనం బ్యూటీ ప్రోడక్ట్స్‌లో వాడతాం. విటమిన్ ఇ ఆయిల్‌ని వాడడం వల్ల సమస్య తగ్గుతుంది. అయితే, నేరుగా రాయొద్దు. ఇందులో కొద్దిగా కొబ్బరినూనె, ఆలివ్ నూనెల్ని కలిపి ఆ తర్వాత ఆ నూనెల్ని నిదానంగా వేళ్లతో మసాజ్ చేయండి.

మంచి నిద్ర

నిద్రలేకపోవడం వల్ల మీ కళ్ల కింద ఉబ్బరం, నల్లని వలయాలు ఏర్పడతాయి. కాబట్టి, రోజూ రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల పాటు మంచి నిద్ర ఉండేలా చూసుకోండి. నిద్రకి ముందు ఆల్కహాల్ తీసుకోవద్దు. దీంతో కూడా నిద్రసమస్యలొచ్చి డార్క్ సర్కిల్స్ ఏర్పడతాయి.

అలర్జీలు తగ్గించుకోండి



చాలా మంది సీజనల్‌గా చాలా అలర్జీలు వస్తుంటాయి. దీని వల్ల కూడా కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడతాయి. ముక్కు దిబ్బడని ప్రేరేపించే అలర్జీలు ఉంటే తుమ్ము, ముక్కు కారడం వంటి లక్షణాలు తగ్గించేందుకు ట్రై చేయండి. దీంతో కళ్లు ఎర్రబడడం, వాపు ఉంటాయి. వీటన్నింటిని తగ్గిస్తే సమస్య దూరమవుతుంది.

శనగపిండి

నగపిండి చర్మ సమస్యల్ని దూరం చేయడంలో బాగా పనిచేస్తుంది. ఓ స్పూన్ శనగపిండిలో కొద్దిగా పసుపు, మరికాస్తా టమాట రసం వేసి బాగా పేస్టులా చేయండి. దీనిని కళ్ల చుట్టూ అప్లై చేయండి. ఆరిన తర్వాత క్లీన్ చేయండి. రెగ్యులర్‌గా చేస్తే సమస్య చాలా వరకూ తగ్గుతుంది.

గమనిక:
నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. అందం, ఆరోగ్యానికి సంబంధించిన ఏ చిన్న సమస్య ఉన్నా వైద్యులను సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.